క్లుప్తంగా

మేడూరు దేవస్థానం ఆదాయం రూ.3.62 లక్షలు



మేడూరు(గంపలగూడెం): మండలంలోని మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తులు హుండీలలో వేసిన నగదును శనివారం లెక్కించారు. గడచిన మూడు నెలల ఎనిమిది రోజులుగా భక్తులు హుండీలలో వేసిన నగదు రూ.3,62,170 లెక్కింపులో వచ్చినట్లు ఆలయం మేనేజర్ జీ వెంకటేశ్వరరావు తెలిపారు. గన్నవరం ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రామకృష్ణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నూజివీడు: మండలంలోని రావిచర్లలోని యూపీ స్కూల్ ఆవరణలో మెడ్‌స్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రొటోకాల్ ఆఫీసర్ పోరండ్ల శ్రీరామమూర్తి శనివారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో ఈసీజీ, ఎకో వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు బి.విజయ చైతన్య నేతృత్వంలో ఈ పరీక్షలను నిర్వహిస్తారన్నారు. పాత రావిచర్ల, కొత్త రావిచర్ల, బోర్వంచ, రామన్నగూడెం, కొన్నంగుంట, కొత్తూరు, వడ్లమాను, అమృతనగర్ ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గాలికుంటు నివారణకు వ్యాక్సిన్

నెమలి(గంపలగూడెం): పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణకై మండలంలో శనివారం నుంచి వ్యాక్సిన్ వేస్తున్నట్లు పశువైద్యాధికారి అభిలాష్ తెలిపారు. మొదటి రోజు నెమలి ఆలయానికి చెందిన గోశాలలో 36 ఆవులతో పాటు గ్రామంలోని మరో 15 పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు పేర్కొన్నారు. పశువైద్యశాఖ సిబ్బంది చిన్నప్ప, రామకృష్ణ, విజయబాబు పాల్గొన్నారు.

టీటీడీ సాయం

రోలుపడి(తిరువూరు): మండలంలోని రోలుపడిగ్రామంలో స్వయంభుగా వెలసిన అంకమ్మ మహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధి పనుల నిమిత్తం తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు గ్రామ సర్పంచ్ ముండ్లపాటి కాంతమ్మ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే రక్షణనిధి ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆలయ అభివృద్ధి నిమిత్తం సాయం కోరుతూ చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిధులు మంజూరయ్యాయన్నారు.

ఆర్థిక సాయం అందజేత



సాయం అందజేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

ఎ.కొండూరు: మండలంలోని పోలిశెట్టిపాడు పీఏసీఎస్ పరిధిలోని గ్రామాల్లో అనారోగ్యం, ప్రమాదాల కారణంగా సంఘ సభ్యులు మృతి చెందితే సహకార సంఘం తక్షణ సాయం అందజేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. పోలిశెట్టిపాడు గ్రామానికి చెందిన పీఏసీఎస్ సంఘ సభ్యుడు ఎం.వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి సహకార సంఘం, కేడీసీసీ బ్యాంకు తరఫున రూ.10 వేల సాయం అందజేసినట్లు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. పీఏసీఎస్ సీఈఓ పి.కోటేశ్వరరావు, సూపర్‌వైజర్ సుబ్బారావు, పెదనరసింహారావు పాల్గొన్నారు.

అసెంబ్లీ తీర్మానం హర్షణీయం

ఆగిరిపల్లి: దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని ఏపీ అసెంబ్లీ తీర్మానం చేయడంపై మాదిగల ఐక్యవేదిక శనివారం ఒక ప్రకటనలో ప్రకటనలో హర్షం తెలిపింది. దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని కోరుతూ ఎన్నో ఏళ్లుగా దేశంలో, రాష్ట్రంలో అనేక ఉద్యమాలు జరిగాయని దీనిని గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర ఇన్‌చార్జి కె.ప్రదీప్, దళిత గిరిజన బహుజన హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్‌బాబు, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు రవిశేఖర్, ముస్లిం మైనార్టీ నాయకుడు నాగుల్‌మీరా హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీకి శనివారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీఓ సత్యవతి తెలిపారు. తిరువూరు బోయబజారులో కార్యకర్త పోస్టు బీసీ ఏ కేటగిరీకి రిజర్వు చేయగా, గంపలగూడెం మండలం లింగాల అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టును బీసీ–బీ కేటగిరీకి, విస్సన్నపేట న్యూ కాలనీ, నూతిపాడు ఆయా పోస్టులకు జనరల్ కేటగిరీకి కేటాయించినట్లు తెలిపారు. ఏప్రిల్ నాల్గో తేదీ లోపు దరఖాస్తులను తమ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

మైలవరం: చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ పుష్పలత తెలిపారు. మైలవరం ఐసీడీఎస్ ప్రాజక్టు పరిధిలోని మైలవరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మహిళలు, బాలింతలు, గర్భిణులకు శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. తల్లులకు పరిపూర్ణ ఆరోగ్యాన్ని చేకూర్చే పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు, ఆకుకూరలు, మునగాకు ఉపయోగాలు, బాలామృతం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగపరుచుకోవాలని సీడీపీఓ పుష్పలత అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా చిన్ననందిగామ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహనా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

గంపలగూడెంలో

గంపలగూడెం: పోషకాలు ఉన్న చిరుధాన్యాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండాలని అంగన్‌వాడీ కార్యకర్తలు సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గంపలగూడెం 65వ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యాన్ని చేకూర్చే చిరుధాన్యాల గురించి వివరించారు. కార్యకర్తలు కస్తూరి, జ్యోతి, స్రవంతి, నాగమణి, ధనలక్ష్మి పాల్గొన్నారు.



చిన్ననందిగామ గ్రామంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పుష్పలత



గంపలగూడెంలో చిరుధాన్యాలపై అవగాహన

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించండి

ఏపీసీపీడీసీఎల్ ఈఈ కృష్ణనాయక్

నూజివీడు : రైతులు వ్యవసాయానికి సంబంధించి సాగునీటి కోసం ఐఎస్ఐ మోటార్లను వినియోగించాలని ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ డీ కృష్ణనాయక్ అన్నారు. వ్యవసాయ రంగంలో సమర్థవంతమైన విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ మోటార్లకు కెపాసిటర్లను వాడటం ద్వారా మరింత మెరుగ్గా పనిచేస్తాయన్నారు. ఫైవ్‌స్టార్ రేటింగ్ ఉన్న విద్యుత్ పరికాలను ఉపయోగించినట్లయితే విద్యుత్ వాడకం తక్కువగా ఉంటుందని, దీని వల్ల అందరికీ అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ లభిస్తుందన్నారు. ఒక యూనిట్‌ను ఆదాచేస్తే మరొక యూనిట్‌ను ఉత్పత్తి చేసినట్లేనని అన్నారు. విద్యుత్ లోడు ఎక్కువగా ఉండే సమయంలో మరింత పొదుపుగా విద్యుత్‌ను ఉపయోగించాలన్నారు. విద్యుత్ తయారీకి బొగ్గు, గ్యాస్, క్రూడాయిల్ వంటి శిలాజ ఇంధనాలను ఉపయోగిస్తారని, విద్యుత్ వాడకంలో పొదుపు లేకపోవడం వల్ల ఈ శిలాజ ఇంధనాలు అతివేగంగా తరిగిపోతున్నాయన్నారు. సాధ్యమైనంత వరకు రైతులు సోలార్ విద్యుత్‌మోటార్లను ఏర్పాటు చేసుకోవడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఏడీఏ విద్యాసాగర్ మాట్లాడుతూ రైతులు దాళ్వా సీజన్‌లో ఆరుతడి పంటలు సాగు చేసుకోవడం ఉత్తమమని తెలిపారు. వీటికి అయితే తక్కువ సాగునీరు సరిపోతుందన్నారు. దీనివల్ల విద్యుత్ అవసరం కూడా తగ్గుతందన్నారు. కార్యక్రమంలో నూజివీడు పట్టణ, రూరల్ డీఈలు ఓలేటి దుర్గారావు, ఎం పోతురాజు, అన్నవరం ఏఈ త్రిమూర్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీసీపీడీసీఎల్ ఈఈ కృష్ణనాయక్

భద్రాచలం నుంచి వచ్చిన తలంబ్రాలు



భద్రాచలం నుంచి తీసుకొచ్చిన తలంబ్రాలు

చాట్రాయి : భద్రాచలం కోదండ రామాలయం నుంచి మండలంలోని చనుబండ కోదండ రామాలయానికి శనివారం తలంబ్రాల బియ్యాన్ని తీసుకొచ్చారు. సుమారు 400 ఏళ్లుగా భద్రాచలం కోదండ రామాలయం నుంచి గోటితో ఒలిచిన బియ్యాన్ని ఇక్కడ జరిగే సీతారాముల కల్యాణంలో వినియోగిస్తుంటారు. ఈ బియ్యాన్ని భక్తుల సందర్శనం కోసం ఆలయంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులను ఆదుకోవాలి

తిరువూరు: నానాటికీ అంతరించిపోతున్న రంగస్థల నాటక రంగాన్ని ఆదుకోవాలని సీనియర్ కళాకారుడు నండూరి వెంకట నరసరాజు అన్నారు. స్థానిక శ్రీసత్యసాయి నాట్య మండలి, వీరాంజనేయ నాట్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానిక త్యాగరాజ గానకళాసమితి ఆవరణలో ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రసార మాధ్యమాలలో వచ్చిన మార్పుతో సంప్రదాయ కళలకు ఆదరణ తగ్గుతున్నందున ప్రభుత్వం తగు ప్రోత్సాహాన్ని అందించాలని నరసరాజు సూచించారు. కళాకారుల కుటుంబాలకు సంక్షేమ పథకాల అమలు, పెన్షను మంజూరులో నిబంధనలు సరళతరం చేయాలని కోరారు. పలువురు కళాకారులను నిర్వాహకులు సత్కరించారు. సత్యసాయి, వీరాంజనేయ నాట్య మండళ్ల నిర్వాహకులు శ్రీనివాసులు, సుబ్బారావు, సుబ్రహ్మణ్యశాస్త్రి, సీతారామలింగేశ్వరశర్మ, వెంకటేశ్వరరావు, రామచంద్రరాజు, ప్రభాకరరావు, రామారావు, నరసింహారావు, ప్రసాద్, ఎస్ఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



తిరువూరులో కళాకారులకు సన్మానం

ఇంటర్ పరీక్షలకు 66 మంది గైర్హాజరు

తిరువూరు: తిరువూరులో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలకు 66 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 345 మంది విద్యార్థులను కేటాయించగా, 306 మంది పరీక్ష రాశారు. నాగార్జున కాలేజీలో 222 మందికి 211 మంది, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 380 మందికి 364 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రథమ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలను రాష్ట్ర పరీక్షల పరిశీలకులు తనిఖీ చేశారు.

నూజివీడులో 81 మంది..

నూజివీడు : ఇంటర్ ప్రథమ సంవత్సరం భౌతికశాస్త్రం, ఎకనామిక్స్ పరీక్షకు శనివారం 81 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని నాలుగు పరీక్ష కేంద్రాలకు కలిపి 1,670 మంది హాజరుకావాల్సి ఉండా 1,589 మంది పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల్లో ఛీఫ్ సూపరింటెండెంట్లుగా ఐ.గిరిదేవి, ఈదర కోటేశ్వరరావు, ఎస్.వెంకటలక్ష్మి, కె.సంధ్యాజ్యోతి వ్యవహరించారు.

పేద విద్యార్థులకు సీట్లు కేటాయించాలి

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని ఎంఈఓ సీహెచ్ పుష్పలత పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోను శనివారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలన్నారు. వ్యవసాయం, మెకానిజం, ఎలక్ట్రికల్, కాలుష్యం నివారణ తదితర అంశాలపై ప్రదర్శించిన ఆవిష్కరణలు ఆమె తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ యలమందారావుపాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మిద్దాం

కనిమెర్ల తండా(మైలవరం): ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం మండలంలో లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల దత్తత గ్రామం కనిమెర్ల తండాలో స్పెషల్ క్యాంప్‌ను శనివారం ప్రారంభించారు. కనిమెర్ల తండా ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. ప్లాస్టిక్ బ్యాగ్‌లు నిషేధించి, పేపర్ బ్యాగ్‌లు వాడాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం సతీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి.శివ హరిప్రసాద్ మాట్లాడుతూ మొక్కల నుంచి ఔషధాల తయారీ జరుగుతుందని, ఆక్సిజన్ లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వలంటీర్లు ఇంటింటికీ తిరిగి పేపర్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు.



కనిమెర్ల తండాలో పేపర్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న వలంటీర్లు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పుట్రేల (విస్సన్నపేట): నాయీబ్రాహ్మణులకు ఆలయ పాలకవర్గాల్లో అవకాశం కల్పించడంపై హర్షం తెలుపుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చిత్రపటానికి నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. మండలంలోని పుట్రేల మారెమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద శనివారం మారెమ్మతల్లి నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ స్వాతి, దేవస్థానం కమిటీ చైర్మన్ సునీల్‌బాబు, జిల్లా వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌దామోదరరెడ్డి పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు

19,413 మందికి ఆసరాతో లబ్ధి

గంపలగూడెం: వైఎస్సార్ ఆసరా పథకంలో గంపలగూడెం మండలంలో 19,413 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు మూడో విడత లబ్ధి పొందుతున్నారని ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం జే నాగరాజులు శనివారం తెలిపారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం విడుదల చేసిన సందర్భంగా కార్యక్రమాన్ని స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో లైవ్ ప్రోగ్రాం అధికారులు, డ్వాక్రా మహిళలతో కలసి వీక్షించారు.

ఆసరా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ఆంజనేయపురం(తిరువూరురూరల్): వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు ఆర్థిక చేయూతను ప్రభుత్వం అందిస్తోందని తిరువూరు మండలం ఆంజనేయపురం సర్పంచ్ మామిడి కుటుంబరావు అన్నారు. శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆసరా పథకం ద్వారా నిధులు విడుదల చేసిన సందర్భంగా ఆంజనేయపురంలో డ్వాక్రా గ్రూపు మహిళలకు నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడారు. గ్రామంలో 36 డ్వాక్రా గ్రూపులకు రూ.13 లక్షలు జమైనట్లు తెలిపారు.

కాలినడకన భద్రాచలం

చాట్రాయి : ఉమ్మడి కృష్ణా జిల్లా గూడూరు మండలం చిట్టిగూడెం గ్రామానికి చెందిన 23 మంది రామ భక్తులు భద్రాచలంలో జరిగే నవమి వేడుకలకు కాలినడకన యాత్ర చేస్తున్నారు. శనివారం మండలంలోని చనుబండ కోదండ రామాలయం వద్ద కాసేపు విశ్రాంతి తీసుకుని జై శ్రీరామ్ అంటూ కాలినడన బయలుదేరారు. ఈ నెల 30న భద్రాచలం చేరుకుంటామని భక్తులు తెలిపారు.

తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలి

చిలుకూరివారిగూడెం(మైలవరం): నాడు–నేడు ఫేజ్–2 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా అడిషనల్ ప్రాజక్టు కో–ఆర్డినేటర్ జి.మహేశ్వరరావు పేర్కొన్నారు. మైలవరం మండలం చిలుకూరువారిగూడెంలోని శ్రీఅప్పిడి సుబ్బారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు ఫేజ్–2 పనులను, సంబంధిత రికార్డులను అడిషనల్ ప్రాజక్టు కో–ఆర్డినేటర్(ఏపీసీ) మహేశ్వరరావు శనివారం పరిశీలించారు. . ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన రివాల్వింగ్ ఫండ్‌తో మిగిలిన పనులు వేగవంతం చేయాలని, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, పేరెంట్స్ కమిటీకి, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఏపీసీతో పాటు జిల్లా సీఎంఓ టీ రాంబాబు, ఐఈఆర్టీ జిల్లా కో–ఆర్డినేటర్ ఎల్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నూజివీడు : పట్టణంలోని 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ డీ కృష్ణనాయక్ శనివారం తెలిపారు. దీనివల్ల పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్డు, బ్యాంక్ స్ట్రీట్, చిన్నగాంధీబొమ్మ సెంటర్, అమ్మవారితోట, ఆర్ఆర్‌పేట, తుక్కులూరు, ఎంప్లాయిస్ కాలనీ, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని, ప్రజలు సహకరించాలని ఈఈ విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

రెడ్డిగూడెం: మండలంలో రంగాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ, ఇంగ్లిష్ మీడియం గ్రూపులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రంగాపురం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ తబిత శనివారం తెలిపారు. 2023–24 సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి, 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతి ప్రవేశానికి ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి గడువు పొడిగింపు

జి.కొండూరు: కుంటముక్కల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరకాస్తు గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకుని దరకాస్తు చేసుకోవాలని కోరారు.

రాహుల్‌పై బీజేపీ కుట్ర

మైలవరం: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీకి జోడో యాత్ర వలన పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకే బీజేపీ కుట్ర పన్ని పార్లమెంట్‌లో అనర్హత వేటు వేసిందని ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రామకృష్ణ పేర్కొన్నారు. మైలవరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం రామకృష్ణ మాట్లాడుతూ రాహుల్ గాంధీని ఎదుర్కొనే ధైర్యం బీజేపీకి లేక చట్ట సభలో అనర్హత వేటు వేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ సభ్యులు తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

తిరువూరు: విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి బాలోత్సవాలు ఉపయోగపడతాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం బాలోత్సవం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. చదువుల ఒత్తిడితో మానసిక అశాంతికి లోనయ్యే విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు ఉత్తేజాన్నిస్తాయన్నారు. పలు సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. వాహినీ కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, బాలోత్సవ ఆహ్వాన కమిటీ ప్రతినిధులు పాపారావు, నాగేంద్రప్రసాద్, వెంకటేశ్వరరావు, చినబాబు, హరికృష్ణ, సుబ్రహ్మణ్యశాస్త్రి పాల్గొన్నారు.



బాలోత్సవంలో విజేతలకు బహుమతులందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక

తిరువూరు: మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థినులు షేక్ నెహాజ్‌బీ, కే జ్యోత్స్న, ఎరుకోపాడు ఎంపీయూపీ స్కూలు విద్యార్థి కోట హర్ష ఈ ఉపకారవేతనానికి ఎంపికైనందుకు ఉపాధ్యాయులు అభినందించారు.

కొండపల్లిలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మూలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థినులు మల్లిమొగ్గల శ్రీపూజిత, దారం హాసినీ, కొండపల్లి జెడ్పీ పాఠశాలకు చెందిన చెరుకు సిద్ధార్థ ఎంపికైనట్లు ఆయా పాఠశాల హెచ్‌ఎంలు శనివారం తెలిపారు. ఫిబ్రవరి 5న నిర్వహించిన ఎంపిక పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించారు. వీరు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది అందించే రూ.18,000 స్కాలర్‌షిప్ పొందుతారు. వీరిని పాఠశాల హెచ్‌ఎంలు శేషగిరిరావు, స్వరూపరాణి అభినందించారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని మర్లపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జి.నిఖిల, జి.నవ్య అనే విద్యార్థులు జాతీయ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం రఘు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎన్ఎంఎంఎస్‌లో అర్హత సాధించిన హిమలలిత

రెడ్డిగూడెం: మండలంలోని ముచ్చనపల్లిలోని ఎంపీయూపీ స్కూల్లో ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎం.హిమలలిత ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో సెలక్ట్ అయినట్లు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఎంపికైన హిమలలితను ఉపాధ్యాయులు అభినందించారు.



స్కాలర్ షిప్‌నకు ఎంపికైన బాలికలను అభినందిస్తున్న స్వరూపరాణి



ఎంపికైన మర్లపాలెం విద్యార్థినులు



సిద్ధార్థ



హిమలలిత

పాడిపరిశ్రమలో ఆధునిక పద్ధతులు

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): పాడిపరిశ్రమల్లో ఆధునిక పద్ధతులు పాటించి అధిక ఆదాయం పొందాలని నందిగామ పశుసంవర్ధక శాఖ ఏడీ వెంకటేశ్వర రావు అన్నారు. సంవర్ధకశాఖ, పశు గణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో కొటికలపూడిలో శనివారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ వయస్సుల లేగదూడలను ప్రదర్శనలో ఉంచారు. ప్రదర్శనలో ఆకట్టుకున్న లేగదూడల యజమానులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పశుగణాభివృద్ధి ఈఓ శ్రీనివాసులు, ఏడీ రాధాకృష్ణమూర్తి, సర్పంచ్ రెంటపల్లి నాగరాజు, బండి వెంకటరావు, దుర్గారావు, పశువైద్యులు హరిత, శైలుమాధురి, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న పశుపోషకులు

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మెరుగుపడాలి

నూజివీడు : అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే రేషన్, పాలు, కోడిగుడ్లు, వైఎస్సార్ కిట్లు సకాలంలో రాకపోయినా, నాణ్యత, సక్రమంగా లేకపోయినా వెంటనే సీడీపీఓ కార్యాలయం దృష్టికి తీసుకురావాలని ఐసీడీఎస్ నూజివీడు సీడీపీఓ నూరాని స్పష్టం చేశారు. నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి మండలాల పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్‌వైజర్లు తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను తరచూ సందర్శిస్తూ క్షుణ్ణంగా అన్ని విషయాలను పరిశీలించి ఏమైనా తేడాలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పోషణ పక్వాడా పక్షోత్సవాలను అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ముమ్మరంగా నిర్వహించి చిరుధాన్యాలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. సమావేశంలో ఏసీడీపీఓ నాగేశ్వరి, సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, రాగమయి, సులోచన, శ్రీలక్ష్మి, శివకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ వర్కర్లకు సూచనలు ఇస్తున్న సీడీపీఓ నూరాని

మార్కెట్‌యార్డులో వసతులు కల్పిస్తాం

ఆగిరిపల్లి: స్థానిక మార్కెట్ యార్డులో అన్ని వసతులు కల్పిస్తామని మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు. ఆగిరిపల్లి మార్కెట్ యార్డును శనివారం ఆయన సందర్శించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మామిడి క్రయ విక్రయ దుకాణాలను పరిశీలించారు. అదేవిధంగా మామిడి ముక్కల ప్రాసెసింగ్ యూనిట్‌ను, మామిడి కాయల గ్రేడింగ్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం జేడీ మాట్లాడుతూ మామిడి రైతులు వేబ్రిడ్జి ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇచ్చారని దానిపై తమ సిబ్బందితో నివేదిక సిద్ధం చేయమన్నట్లు తెలిపారు. యార్డులో భవనాలకు మరమ్మతులు చేయిస్తామని, దీనిని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.శారదరాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహారావు పాల్గొన్నారు.